PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :190 | పేజీలు : 8 | వెల రూ.5 | శుక్రవారం 31.07.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




# విద్యా వ్యవస్థలో.. విప్లవాత్మక మార్పులు

## సంస్కరణలతో తెలంగాణకు దేశంలో 18 వ స్థానం

- విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ ఇస్తున్నాం
- ఐటీఐలను ఏటీసీలుగా మార్చాం
- సంస్కరణ ఫలితంగా డ్రాప్ అవుట్ లు తగ్గాయి
- విద్యా మంత్రిగా ఇంత మార్పు తేస్తే రాజీనామా చేయమంటారా?
- విపక్షాలపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

ప్రభాత సూర్యుడు

### ప్రధాని మోదీపై విమర్శలు

ఇదే వేదికగా కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్యం నుంచి 2014 వరకు ఉన్న దేశ మొత్తం అప్పు రూ.51 లక్షల కోట్లు ఉంటే, 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే ఆ అప్పు రూ.151 లక్షల కోట్లకు చేరిందని ఆరోపించారు. విమర్శలను పట్టించుకుంటే ముందుకు వెళ్లలేమని, ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. అలాగే కుంటలు, చెరువులు, కాలువలు, పెద్దవాగులు వర్షపు నీటితో నిండిపోయాయి. వర్షాల తీవ్రత కొనసాగుతుండటంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారు..

జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు వేసిన పునాదులతో ఇప్పుడు మన దేశంలో లైఫ్‌స్పాన్ పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇక్కడి పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని చెప్పారు. విద్యలో నాణ్యత పెరగాలని, పిల్లలకు పౌష్టికాహారం అందాలని సూచించారు. తెలంగాణలో తనకు తెలిసిన మేధావులు ఇద్దరేనని.. వారిలో కేకే, జైపాల్‌రెడ్డి అని అభివర్ణించారు. విద్య విషయంలో బాధ్యత తీసుకోవాలని కేకేను అడిగానని చెప్పుకొచ్చారు. ఆయన సలహాదారుగా అనేక సూచనలు చేస్తున్నారని తెలిపారు. వెనకబాటుతనానికి కారణం చదువులేకపోవడమేనని చెప్పుకొచ్చారు. చదువుకున్న ఎస్సీలు సమాజంలో మంచి స్థానంలో ఉన్నారని వివరించారు. ఆస్తులున్నా.. చదువు లేకపోతే సమాజంలో వెనకపడిపోతున్నారని వెల్లడించారు. విద్యార్థులను సమాజంలో గొప్పగా నిలబెట్టగలిగిన శక్తి ఉపాధ్యాయులకు ఉందనీ కొనియాడారు. ప్రతీ విద్యార్థిపై రూ.1,08,000 ఖర్చు తాము చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.



### ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదు..

పీవీ నర్సింహారావు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వేల్‌లో ఆ స్కూల్లోనే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు చదువుకున్నారని ప్రస్తావించారు. నవోదయకు స్ఫూర్తి సర్వేల్ గురుకులమని చెప్పుకొచ్చారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదని అభిప్రాయపడ్డారు. ప్రపంచం ఇంకా మెరుగైన నాణ్యమైన విద్య ఆశిస్తుందని తెలిపారు. నేర్చుకోవడమే కాదని.. నేర్చుకున్న వాళ్లతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని అన్నారు. జర్మన్, జపాన్, సౌత్ కొరియా, చైనా లాంటి దేశలతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని సూచించారు. బదిలీలు, ప్రమోషన్లు అన్నీ అడగకుండానే తాము ఇచ్చామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సమస్యలు తనకు వదిలేయాలని అన్నారు. వారి సమస్యలను తాను పరిష్కరిస్తానని మాటిచ్చారు

# వందేమాతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం.. మూజువాణి ఓటుతో నెగ్గిన బిల్లు

ఢిల్లీ :ప్రభాత సూర్యుడు కేంద్రం ప్రవేశపెట్టిన వందేమాతరం బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. గురువారం లోక్‌సభలో ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. రాజ్యసభలో బుధవారమే ఈ బిల్లు ఆమోదం పొందగా.. గురువారం లోక్‌సభలో ఆమోదం లభించింది. ఇప్పుడు ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇందుకోసం ఈ బిల్లును రాష్ట్రపతి ముందుకు పంపనుంది కేంద్రం. 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 పేరుతో రూపొందిన ఈ బిల్లును జూలై 24న కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది.దీనికి జూలై 29న రాజ్యసభ ఆమోదం తెలిపింది. అనంతరం జూలై 30, గురువారం లోక్‌సభలో బిల్లు నెగ్గింది. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనల మధ్యే ఈ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందడం విశేషం. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై దాడి వంటి అంశాలపై లోక్‌సభలో వాడివేడి చర్చ జరుగుతుండగానే ఈ బిల్లును కేంద్రం పాస్ చేయించుకుంది. ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టంగా మారాలంటే దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉన్న 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971కి ఇది సవరణ బిల్లు. దీని ప్రకారం జాతీయ గీతమైన జనగణమనలాగే, జాతీయ గేయమైన వందేమాతరాన్ని కూడా గౌరవించాల్సి ఉంటుంది. ఈ గేయాన్ని అవమానపరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.భారత రాజ్యాంగం, జాతీయ పతాకం, జాతీయ గీతంలాగే ఇకపై జాతీయ గేయానికి కూడా చట్టబద్ధమైన రక్షణ, గౌరవం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం.. వందేమాతరం గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొన్నిసార్లు జరిమానా కూడా విధిస్తారు. వందేమాతరం పాడేటప్పుడు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా, అడ్డుకున్నా కూడా శిక్షార్హులే. వందేమాతరం రాసి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ బిల్లును, ఆ గేయానికి గౌరవ సూచకంగా ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.






# విద్యార్థులపై లాఠీఛార్జ్ చేస్తే.. అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు? : ఖర్గే

న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడు నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. గురువారం రాజ్యసభలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి? అని మోదీ సర్కారును ఆయన నిలదీశారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని ఖర్గే అభివర్ణించారు. 2024లోనే ఈ బిల్లు ఎందుకు తీసుకురాలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు తప్ప విద్యార్థులపై ప్రేమ లేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. బిహార్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులపై తుపాకులు ఎక్కుబెట్టారని విమర్శించారు. ఆందోళన చేసిన యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి.

## ఇండ్ల లబ్ధిదారులు త్వరగా ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





వనపర్తి జులై 30 ప్రభాత సూర్యుడుఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణాలను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మకూర్, అమరచింత మండలాల ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల్లో ఉన్న గుడిసెల్లో నివసించే వారిని పూర్తిస్థాయిలో ధృవీకరించి, అర్హులైన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వ లాగిన్‌లో తమ వద్దకు పంపాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై కూడా ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, వారిని వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. ఆర్థిక కారణాలతో వారు ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉంటే వారికి స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణాలను ఇప్పించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒకవేళ మంజూరైన గృహాన్ని నిర్మించేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపకపోతే, సంబంధిత నిబంధనల ప్రకారం వారి మంజూరును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఆ గృహాన్ని మరో అర్హులైన నిరుపేద కుటుంబానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థులు పదో తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాలి అనంతరం ఆత్మకూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను (జెడ్పీహెచ్ఎస్ బాయ్స్) సందర్శించిన కలెక్టర్, అక్కడ నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసి అందజేయాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. అవసరమైన చర్యలు తీసుకొని నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదే పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మమేకమై, పాఠశాలలో అందుతున్న భోజనం, వసతులు, బోధన తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ప్రోత్సహించారు.

**కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ స్థల పరిశీలన**

ఆత్మకూర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, భవన నిర్మాణ నమూనా (మ్యాప్)ను పరిశీలించి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. నిర్మాణ పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆత్మకూరు పట్టణంలో ఐదో వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న బైని జానకమ్మ అనే లబ్ధిదారురాలు ఇంటిని కలెక్టర్ సందర్శించారు. ఇంటి నిర్మాణం పనుల గురించి లబ్ధిదారులతో ఆరా తీసిన కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఆత్మకూరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు నమూనా గృహాన్ని సందర్శించి పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమాల్లో హౌసింగ్ పీడి విటోబా, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ పీఎస్‌కు ఇద్దరు కొత్త ఎస్సైలు

నాగోల్ -- ప్రభాత సూర్యుడు:నాగోల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్ఐలు సూర్య నాయక్, మమతారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ సమక్షంలో విధుల్లో చేరిన వారికి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. సూర్య నాయక్ గతంలో పలు పోలీస్ స్టేషన్లలో పనిచేయగా, మమతారెడ్డి జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ నుంచి నాగోల్‌కు బదిలీపై వచ్చారు.




## ఓపీఎస్ సాధన కోసం అసెంబ్లీని స్తంభింపజేసైనా పోరాడతాం: హరీశ్ రావు

ప్రభాత సూర్యుడు – సిద్దిపేట సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో సీపీఎస్ ఉద్యోగులు నిర్వహించిన 'జన చైతన్య యాత్ర' నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి, శాసనసభాపక్ష ఉపనేత టి. హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓపీఎస్ అమలు, పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఈహెచ్ఎస్ అమలు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 32 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే వారు ఉద్యమబాట పట్టారని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఓపీఎస్, డీఏలు, పీఆర్సీ వంటి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అవసరమైతే అసెంబ్లీని స్తంభింపజేసైనా ఉద్యోగుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రభుత్వం ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్ కేసులను ఉపయోగిస్తోందని ఆరోపించిన ఆయన, ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. విద్యాశాఖ పనితీరుపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. స్కూళ్లకు గ్రాంట్లు, చాక్‌పీస్ కొనుగోలు నిధులు లేకపోవడం, స్కావెంజర్లకు జీతాలు బకాయి ఉండడం, విద్యార్థులకు యూనిఫాంలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. అలాగే, ఇంజినీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన హరీశ్ రావు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను అవమానించేలా మాట్లాడడం బాధాకరమని అన్నారు. ఆ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థులు, ఉపాధ్యాయులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఈహెచ్ఎస్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.






## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం ఉండాలి

**– 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు**


**– ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**




ప్రభాత సూర్యుడు – రంగారెడ్డిరాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు అత్యవసర సహాయ సేవలు అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నీటితో నిండిన రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని, చెట్లు కూలే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ముంపు, రవాణా అంతరాయం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, అందిన ప్రతి సమాచారంపై సంబంధిత శాఖలు తక్షణమే స్పందించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు వాతావరణ శాఖ హెచ్చరికలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కంట్రోల్ రూమ్ సంప్రదింపు నంబర్లు:040-23237416 9704958473

## హుస్నాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్, IPS

ప్రభాత సూర్యుడు – సిద్దిపేట వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ గురువారం హుస్నాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న కమిషనర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమె కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, పోలీస్ స్టేషన్‌లోని అన్ని రకాల రికార్డులను మరియు ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను నిశితంగా తనిఖీ చేశారు. అనంతరం ఏసీపీ సదానందం గారికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు: ఎస్సీ/ఎస్టీ, పోక్సో మరియు ఇతర గ్రేవ్ కేసుల దర్యాప్తును నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యాలయానికి సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పారదర్శకంగా ఉంచాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో ఓపికగా మాట్లాడి, వారి సమస్యలను వినాలని అధికారులకు సూచించారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటికి త్వరగా పరిష్కారం లభించేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా డివిజన్లోని అన్ని గ్రామాలలో సీసీటీవీ కెమెరాలను అమర్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. సిద్దిపేట పోలీస్ ఉద్యోగమిత్ర పోర్టల్ గురించి అన్ని గ్రామాలలో యువతకు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందంతో పాటు హుస్నాబాద్ సీఐ శ్రీధర్, చేర్యాల సీఐ రమేష్, ఎస్ఐలు మహేష్, లక్ష్మారెడ్డి, ప్రశాంత్, అభిలాష్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం**



ఘట్కేసర్ జులై 30 ప్రభాత సూర్యుడు: సాదా బైనామా, భూ భారతి పెండింగ్ దరఖాస్తులు, గ్రామాల రీసర్వే, ఎలక్ట్రోల్ ఎన్‌రోల్‌మెంట్ (ఎస్ఐఆర్) ప్రక్రియలను వేగవంతం చేసి, పెండెన్సీని త్వరితగతిన పూర్తి చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాదా బైనామా, భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, భూ రికార్డులు, గ్రామాల రీసర్వే ప్రక్రియతో పాటు ఎలక్ట్రోల్ ఎన్‌రోల్‌మెంట్ (ఎస్ఐఆర్)కు సంబంధించిన పనుల పురోగతిని పరిశీలించారు. భూ భారతి పోర్టల్‌లో దరఖాస్తుల పరిష్కారానికి ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను తెలుసుకుని, సమస్యలను వెంటనే పరిష్కరించేలా తగిన సూచనలు చేశారు. సాదా బైనామా, భూ భారతి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన భూ రికార్డుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో రూ.76.46 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి శ్రీధర్ బాబు**



ఉప్పల్ జులై 30 ప్రభాత సూర్యుడు నియోజకవర్గంలో రూ.76.46 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రహదారులు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, ఫుట్‌పాత్‌లు, క్రీడా సదుపాయాలు, శ్మశానవాటికల అభివృద్ధి తదితర పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రామంతాపూర్‌లోని భజరంగ్ వ్యాయామశాల అభివృద్ధికి రూ.90 లక్షలు కేటాయించి భవనం విస్తరణ, బోర్‌వెల్, ఆధునిక జిమ్ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. రామంతాపూర్ భాగాయత్--ఉప్పల్ ప్రాంతంలో రూ.56.355 కోట్లతో ప్రధాన స్టార్మ్ వాటర్ డ్రైన్లు, ఫుట్‌పాత్‌లు, మల్టీ స్పోర్ట్స్ అరేనా, సీసీ రోడ్లు, బస్‌స్టాప్‌తో పాటు అనుబంధ మౌలిక వసతుల పనులు చేపట్టనున్నారు. బొడ్రాయి--చిలకనగర్--బీరప్పగడ్డ ప్రాంతాల్లో రూ.3.23 కోట్లతో సీసీ రోడ్ల మరమ్మతులు, డ్రైన్ల పునర్నిర్మాణం, రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన, శ్మశానవాటికల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. చెర్లపల్లి, వాంపుగూడ, కాప్రా ప్రాంతాల్లో రూ.15.97 కోట్లతో కల్వర్టుల పునర్నిర్మాణం, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, ఆర్‌సీసీ పైప్‌లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పట్టణ మౌలిక వసతులు, మెరుగైన పౌర సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చేపడుతున్న పనులతో ఉప్పల్‌లో రహదారులు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, క్రీడా సదుపాయాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట మంత్రి సీతక్క

## గత ఏడాది కాలంలోనే 5,938 కేంద్రాలకు టాయిలెట్లు, 3,815 కేంద్రాలకు తాగునీరు, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం

## రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వంద శాతం మౌలిక వసతులు కల్పించాలి

## ఏ మాత్రం జాప్యం లేకుండా అన్ని జిల్లాల్లో అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలి

## అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలి

## అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క





ములుగు జూలై 30, ప్రభాత సూర్యుడుఅంగన్వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్ సదుపాయం, 3,815 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్న మంత్రి.. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, చిన్నారుల పోషకాహారం, పాఠశాల పూర్వ విద్య, దత్తత కేంద్రాలు, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఏ కేంద్రంలో ఏ పని పూర్తయింది, ఇంకా ఎంత పని మిగిలి ఉందన్న వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు. చిన్నారుల ఉదయం ఆకలిని తీర్చడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడేలా బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి నాణ్యమైన ఆహారం అందడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, సేవల మెరుగుదలకు సంబంధించిన సూచనలను స్వీకరించి వాటి ఆధారంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. 16 జిల్లాల్లో నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. టీచర్లు, ఆయాల యూనిఫాంలను అక్టోబర్ తొలి వారంలోగా సిద్ధం చేయాలని, అంగన్వాడీ టీచర్లకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకర్షించేలా, ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. కేంద్రాలకు ముదురు రంగులు కాకుండా పిల్లలకు ఉత్సాహాన్ని కలిగించే ఆహ్లాదకరమైన రంగులు వేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల అభ్యాసం, ఆటపాటలు, ఆరోగ్యం, పోషణకు అనువైన వాతావరణంగా మారాలని చెప్పారు. వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా అంగన్వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా మార్చాల్సిన పరిస్థితి వస్తే, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అవసరమైన అన్ని జిల్లాలు, ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసి బాలింతలకు సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నట్లు అధికారులు వివరించారు. పిల్లల సంరక్షణ, దత్తత ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాల్య వివాహాల నివారణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

**నిధులు లాప్స్ కాకుండా పూర్తిగా వినియోగించాలి**

కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయి సమర్థవంతంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా ఇద్దరు, ముగ్గురు అధికారులను నియమించి సమన్వయ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారుల మధ్య సమన్వయం కోసం కూడా ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, రోజువారీ, వారపు నివేదికలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని మంత్రి సూచించారు. ఎన్ని కేంద్రాలు, హాస్టళ్లను సందర్శించారు, అక్కడ గుర్తించిన సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటన్న వివరాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

# బీసీ గురుకుల పాఠశాలలో డీఎంహెచ్ ఓ ఆకస్మిక తనిఖీ

## ఆహారం, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై పరిశీలన





తుర్కపల్లి, జూలై 30, ప్రభాత సూర్యుడు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర వసతి గృహం)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సింగ్ అధికారి నిర్వహిస్తున్న ఆరోగ్య రికార్డులు, మందుల లభ్యత, వంటశాల, వసతి గృహంలోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, కూరగాయల నిల్వ, వంటశాల పరిశుభ్రతను తనిఖీ చేసిన డా. ఆనంద్.. ఆహారం తాజాగా, నాణ్యంగా, పోషక విలువలతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. తనిఖీలో గుడ్ల నిల్వ లేకపోవడం గుర్తించి, ప్రభుత్వం నిర్దేశించిన పోషకాహారం విద్యార్థులకు నిరంతరం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహంలో 783 మంది విద్యార్థుల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 679 మంది ఉన్నట్లు వెల్లడైంది. హాస్టల్ పరిసరాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైతే ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిఎంహెచ్ఓ ఆదేశించారు.

# ముస్లిం క్రైస్తవులకు సర్ పై ప్రత్యేక అవగాహన



జులై 30 ప్రభాత సూర్యుడు పటాన్ చేరువు లోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం, క్రైస్తవ మైనార్టీలు, సెంట్రింగ్ మిల్లర్ల కార్మికులకు సర్ ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు! గడువు ముగిసే లోపు అర్హులంతా తమ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

# సీఎం పదవిపై జగ్గారెడ్డి కీలక వాక్యాలు



జులై 30 ప్రభాత సూర్యుడు: సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వాక్యాలు తెలంగాణ కాంగ్రెస్ లో కొత్తచర్చకు తేర లేపినట్లు అయింది! తనకు ముఖ్యమంత్రి కావాలనే ఆశ లేదన్న ఆయన సీఎం రేసులో ఉత్తం కుమార్ రెడ్డి ఉన్నారని స్పష్టం చేశారు. రాజకీయంగా తన కోరిక ఉందని దాన్ని నవంబర్ మాసంలో లో వెల్లడిస్తానని చెప్పారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తారా? లేక ఉత్తమ్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు రేసులోకి వస్తారని చర్చ మొదలైంది.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ములుగు జూలై 30, ప్రభాత సూర్యుడు):రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు కీ.శే. తిప్పనబోయిన రామకృష్ణ ముదిరాజ్ కుటుంబానికి పార్టీ అండగా నిలిచింది. ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు స్వయంగా స్పందించి, తన తరఫున 20,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని పంపించారు. బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు గారు పంపించిన ఈ ఆర్థిక సహాయాన్ని, మండల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు నేడు మృతుడి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, లక్ష్మణ్ బాబు తరపున మరియు పార్టీ తరపున తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరిచారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి, పార్టీ బలోపేతానికి మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా రామకృష్ణ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు తుమ్మ మల్లారెడ్డి, ఎండి ఖజా పాషా, తాడూరి రఘు, సయ్యద్ సర్దార్ పాషా, సప్పిడి రాంనర్సయ్య, సర్పంచ్ నాగార్జున, గుజ్జేటి రాజు యాదవ్, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, సిద్ధవైన రాంబాబు, మాదరి చంద్రమౌళి, ఏనుగుల మహేష్, మహేష్, జాడి బోజరావు, కొడాయి చిన్ని, కాళ్ళ రామకృష్ణ, బట్టు గోపి, యాకూబ్ పాష, టీచర్ బాబురావు, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కీ.శే. రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# నకిలీ బంగారం ముఠా సభ్యులపై పోలీసులు నిఘా.




సింగరేణి జూలై 30 ప్రభాత సూర్యుడ్.రోల్డ్ గోల్డ్ ను బంగారంగా నమ్మిస్తూ ప్రవేట్, ప్రభుత్వ బ్యాంకులలో తాకట్టు పెట్టే ముఠాపై కారేపల్లి పోలీసులు నిఘ ఏర్పాటు చేశారు. కారేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి? మండలం పరిధిలోనే ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి? కొంతమంది ఏజెంట్లతో డబ్బు ఎర చూపుతూ బ్యాంకులలో రోల్డ్ గోల్డ్ ను తాకట్టు పెట్టి నగదు పొందిన ఘటనలపై పోలీస్ స్టేషన్ ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసును నలుమూలల విచారిస్తున్నారు. రోల్డ్ గోల్డ్ గత కొంతకాలంగా ప్రవేట్ బ్యాంకులలో తాకట్టు పెట్టి నగదు పొందిన ఘటనలు వెలుగులకు వస్తున్నాయి. పోలీసులు సూచన మేరకు బ్యాంక్ అధికారులు ,బంగారు దుకాణ యాజమాన్యులు గోల్డ్ ను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే తాకట్టుకు స్వీకరించాలని సూచించారు. ఎవరైనా వ్యక్తులు తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ గ్రామంలో తిరిగితే అలాంటి వ్యక్తులను నమ్మకుంట పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని పోలీస్ అధికారులు మండల ప్రజలకు తెలిపారు.



# కంటెంట్ తో పని లేకుండా కలెక్షన్స్

ముఖ్యంగా విజయ్ ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉండటంతో ఈ సినిమాకు ఒక రేంజ్ లో క్రేజ్ వచ్చింది. ఏదైనా సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్స్ సాధిస్తే అందులో కథ లేదా మేకింగ్ బాగుందని అనుకుంటారు. కానీ కొన్నిసార్లు సినిమా రిజల్ట్ తో సంబంధం లేకుండా చుట్టూ ఉన్న పరిస్థితులు, రిలీజ్ టైమ్ కలిసిరావడం వల్ల కూడా వసూళ్లు భారీగా వస్తుంటాయి. ప్రస్తుతం దళపతి విజయ్ నటిస్తున్న జననాయగన్ సినిమా విషయంలో కూడా సరిగ్గా ఇదే జరుగుతోందని ట్రేడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. సినిమాకు మిక్స్డ్ టాక్ వచ్చినా కూడా బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ తగ్గకపోవడం వెనుక కొన్ని ప్రత్యేకమైన కారణాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం తమిళనాడులో వేరే పెద్ద హీరోల సినిమాలు థియేటర్లలో ఏవీ లేకపోవడం ఈ చిత్రానికి పెద్ద ప్లస్ పాయింట్ గా మారింది. ఆడియన్స్ కు థియేటర్ కి వెళ్తే వేరే ఆప్షన్స్ లేవు. దాంతో సోలోగా వచ్చిన ఈ సినిమాకు స్క్రీన్స్ అన్నీ దక్కాయి. దీనికి తోడు విజయ్ కి ఇదే చివరి సినిమా కావడం, ఇకపై ఆయన సినిమాలకు గుడ్ బై చెప్పేస్తుండటం కూడా కలెక్షన్లకు బాగా కలిసొచ్చింది.



కొత్తసినిమాలు ముఖ్యంగా విజయ్ ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉండటంతో ఈ సినిమాకు ఒక రేంజ్ లో క్రేజ్ వచ్చింది. ఒక పక్క రాష్ట్రానికి సీఎంగా ఉంటూనే ఆయన నటించిన చివరి చిత్రం థియేటర్లలోకి రావడంతో ఫ్యాన్స్ తో పాటు నార్మల్ ఆడియన్స్ కూడా సినిమా చూడటానికి ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న స్టార్ హీరో స్క్రీన్ మీద ఎలా కనిపిస్తాడో చూడాలనే క్యూరియాసిటీ జనాలను థియేటర్ల వైపు నడిపిస్తోంది. ఇలాంటి కొన్ని అంశాలు అనుకూలంగా మారడం వల్లే ఫస్ట్ వీక్ లో కలెక్షన్స్ ఈ రేంజ్ లో వచ్చాయని చెప్పవచ్చు. సినిమా కంటెంట్ మాత్రమే కాకుండా, ఈ రిలీజ్ టైమింగ్స్, కాంపిటీషన్ లేకపోవడం కలగలిపి కలెక్షన్ల గ్రాఫ్ పడిపోకుండా కాపాడాయి. ఇలాంటి ప్లస్ పాయింట్స్ అన్నీ ఒకేసారి సెట్ అవ్వడం వల్ల టాక్ తో పనిలేకుండా బాక్సాఫీస్ దగ్గర సినిమా క్లిక్ అయిపోయింది. మరోవైపు విజయ్ రెమ్యునరేషన్ గురించి వస్తున్న వార్తలకు కూడా ఈ కలెక్షన్స్ ఒక క్లారిటీ ఇచ్చేలా ఉన్నాయి. ఈ సినిమా కోసం ఆయన దాదాపు రెండు వందల కోట్ల పారితోషికం తీసుకున్నారనే టాక్ చాలా రోజులుగా నడుస్తోంది. ఒక హీరోకి అంత పెద్ద అమౌంట్ ఇవ్వడం రిస్క్ అని చాలామంది అనుకున్నారు. కానీ సినిమా కథ మీద నెగిటివిటీ ఉన్నా కూడా, కేవలం ఆయన క్రేజ్ తోనే ఈ స్థాయిలో ఓపెనింగ్స్ రావడం చూస్తుంటే ఆ గాసిప్స్ లో నిజం ఉందేమో అనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఫుల్ రన్ లో ఎంత వసూలు చేస్తుందనేది పక్కన పెడితే, ప్రస్తుతానికి మాత్రం తమిళ ఇండస్ట్రీలో విజయ్ స్టార్ డమ్ కి ఉన్న పవర్ ఏంటో ఈ వసూళ్లు క్లియర్ గా చూపిస్తున్నాయి.

# ‘లక్కీ భాస్కర్ 2’ ఫిక్స్.. కానీ- వెంకీ అట్లూరి!

తాజాగా ఈ సినిమా సీక్వెల్‌పై దర్శకుడు వెంకీ అట్లూరి ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. దుల్కర్ సల్మాన్ హీరోగా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన ‘లక్కీ భాస్కర్’ ఎంతటి పెద్ద విజయం సాధించిందో మనందరికీ తెలిసిందే. బ్యాంకింగ్ డ్రామాగా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. తాజాగా ఈ సినిమా సీక్వెల్‌పై దర్శకుడు వెంకీ అట్లూరి ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. లక్కీ భాస్కర్ 2 ఖచ్చితంగా ఉంటుందని, కానీ అది పట్టాలెక్కడానికి కాస్త సమయం పడుతుందని స్పష్టం చేశారు. ఆ వివరాలు చూద్దాం..బ్యాంకింగ్ రంగంలో జరిగే మోసాలు, ఒక సామాన్యమైన వ్యక్తి లైఫ్‌లో వచ్చిన మార్పుల నేపథ్యంలో వచ్చిన ‘లక్కీ భాస్కర్’ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇక దుల్కర్ సల్మాన్ నటన, వెంకీ అట్లూరి టేకింగ్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. రిలీజ్ అయినప్పటి నుంచే ఈ సినిమాకు సీక్వెల్ ఉంటే బాగుంటుందని ఫ్యాన్స్ భావించారు. సీక్వెల్ ఉందంటూ దర్శకుడి క్లారిటీ: ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ‘లక్కీ భాస్కర్ 2’ తప్పకుండా ఉంటుందని తేల్చి చెప్పారు. మొదటి భాగం తెచ్చిపెట్టిన భారీ విజయం వల్ల సీక్వెల్‌పై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. కాబట్టి ఏమాత్రం తొందరపడకుండా, పక్కా ప్రీ-ప్లానింగ్‌తోనే రెండో భాగాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. చేతిలో ఉన్న ప్రాజెక్టులు ఇవే: అయితే ఈ సీక్వెల్ కంటే ముందే వెంకీ అట్లూరి పూర్తి చేయాల్సిన కమిట్‌మెంట్స్ కొన్ని ఉన్నాయి. ప్రస్తుతం ఆయన తమిళ స్టార్ హీరో సూర్యతో ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ అనే సినిమా చేస్తున్నారు. ఈ సినిమా పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. దీని తర్వాత ధనుష్‌తో ఒక సినిమా చేయడానికి ఇప్పటికే స్టోరీ లైన్ ఓకే చేయించుకున్నారు. రెండేళ్ల తర్వాతే ‘లక్కీ భాస్కర్ 2’: ముందుగా సూర్య సినిమా రిలీజ్ కావడం, ఆ తర్వాత ధనుష్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంపైనే వెంకీ అట్లూరి దృష్టి పెట్టారు. ఈ రెండు సినిమాలు పూర్తయిన తర్వాతే ‘లక్కీ భాస్కర్ 2’ స్క్రిప్ట్ వర్క్ స్టార్ట్ చేస్తారట. ఈ ప్రాసెస్ అంతా పూర్తి కావడానికి దాదాపు రెండేళ్ల సమయం పడుతుందని, ఆ తర్వాతే లక్కీ భాస్కర్ సీక్వెల్ షూటింగ్ ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. కొత్తసినిమాలు ఏది ఏమైనా ‘లక్కీ భాస్కర్ 2’ వస్తుందని అఫీషియల్‌గా కన్ఫర్మ్ కావడంతో దుల్కర్ ఫ్యాన్స్ తెగ ఖుషీ అవుతున్నారు. కొంచెం ఆలస్యమైనా సరే మొదటి భాగాన్ని మించేలా పర్ఫెక్ట్ కథతో రావాలని వెంకీ అట్లూరి ప్లాన్ చేస్తున్నారు. కాబట్టి భాస్కర్ మళ్లీ వచ్చి బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో చూడాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే.





# రామాయణంలో సాయి పల్లవి కంటే ముందున్న సీతమ్మలు!

చలనచిత్ర పరిశ్రమలో పౌరాణిక చిత్రాలకు, ముఖ్యంగా రామాయణ గాథకు ప్రత్యేకమైన స్థానం ఉంది. తెరపై సీతాదేవి పాత్రలో నటించడం అంటే కేవలం నటన మాత్రమే కాదు. చలనచిత్ర పరిశ్రమలో పౌరాణిక చిత్రాలకు, ముఖ్యంగా రామాయణ గాథకు ప్రత్యేకమైన స్థానం ఉంది. తెరపై సీతాదేవి పాత్రలో నటించడం అంటే కేవలం నటన మాత్రమే కాదు. కోట్లాది మంది ప్రజల మనసుల్లో దైవత్వాన్ని నింపే పవిత్రమైన బాధ్యత అది. త్వరలో రాబోతున్న భారీ బడ్జెట్ గ్లోబల్ ప్రాజెక్ట్ -రామాయణం-లో నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సౌత్ ఇండియన్ తెరపై ఇంతకుముందు సీత పాత్రను పోషించి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కొందరి ఐకానిక్ నటీమణుల గురించి ప్రత్యేకంగా చర్చించుకోవాలి. ఐ వాంట్ యువర్ సెక్: బోల్డ్ అండ్ ప్లేఫుల్ ఎంటర్‌టైనర్! తెలుగు సినిమా చరిత్రలో పౌరాణిక పాత్రలంటే ముందుగా గుర్తువచ్చేది మహానటి సావిత్రి. ఆమె తన అద్భుతమైన అభినయంతో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించినా? సీతాదేవి పాత్రకు సావిత్రి పోషించిన జీవం అసాధారణం. అప్పట్లో రిలీజ్ అయిన పౌరాణిక చిత్రాలలో సీత పాత్రలో సావిత్రి కనబరిచిన హావభావాలు, గంభీరత , ఎమోషన్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తెలుగు తెరపై సీతాదేవి అనగానే సావిత్రి రూపమే నేటికీ ప్రేక్షకుల మదిలో మెదులుతూనే ఉంటుంది. ఇది తదానంతరం వచ్చిన ఎందరో? నటీమణులకు గొప్ప మార్గదర్శకంగా నిలిచింది. టాలీవుడ్ లో మరో సీతమ్మ అంటే? నటి జయప్రద. దర్శకరత్న బాపు దర్శకత్వంలో తెరకెక్కిన -సీతా కళ్యాణం- చిత్రంలో జయప్రద సీతాదేవిగా నటించి అపూర్వమైన కీర్తిని సంపాదించారు. ఆ చిత్రంలో జయప్రద అచ్చమైన దేవతలా కనిపిస్తూ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేశారు. ఆ సినిమా విజయంలో ఆమె పాత్ర పోషించిన తీరు ఎంతో కీలకం. ఇప్పటికీ తెలుగు సినిమా చరిత్రలో క్లాసిక్ పౌరాణిక చిత్రంగా నిలిచిపోయిన ఆ సినిమాలో జయప్రద నటన మైలురాయిగా చెప్పుకోవచ్చు. భాగ్యశ్రీ కామెంట్స్ తో మొదలైన కొత్త డిస్కషన్ మరో దిగ్గజ నటి వాణిశ్రీ కూడా పౌరాణిక చిత్రాలలో తనదైన ముద్ర వేసారు. సీతాదేవి పాత్రకు అవసరమైన అంకితభావం, పవిత్రత ,రాచరికపు హుందాతనాన్ని తన నటన ద్వారా అద్భుతంగా పండించారు. పౌరాణిక పాత్రలు చేయడం అంత సులభం కాకపోయినా? నటీమణులు తమ అంకితభావంతో ఆ పాత్రలకు పూర్తిన్యాయం చేశారు. నేటి తరానికి చెందిన నటీమణులకు ఆనాటి తారలు నటనలోనూ, సంప్రదాయబద్ధతలోనూ పాఠంగా నిలిచారు. తర్వాత కాలంలో వచ్చిన మరికొంత మంది నటీమణులు కూడా ఇలాంటి పవిత్ర పాత్రలను పోషించి మెప్పించారు. నయనతార వంటి స్టార్ హీరోయిన్లు కూడా పౌరాణిక నేపథ్యంలో తెరకెక్కిన చిత్రాలలో సీతాదేవిగా నటించి ప్రేక్షకు లను అలరించారు. మారుతున్న కాలానికి తగినట్లుగా ఆధునిక సాంకేతికతను జోడిస్తూ తెరకెక్కుతున్న రామాయణ కథల్లో ఈ పాత్రల ప్రాముఖ్యత మరింత పెరిగింది. సౌత్ ఇండియన్ నటీమణులు గ్లోబల్ స్థాయిలో సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ పాత్రలకు జీవం పోయడం అభినందించదగ్గ విషయం. ఈ సాంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్తూ.. గ్లోబల్ ప్రాజెక్ట్ -రామాయణం-లో సీతాదేవి పాత్రను సాయి పల్లవి పోషిస్తుండటం విశేషం. తన సహజమైన నటనకు, అద్భుతమైన హావభావాలకు పేరుగాంచిన సాయి పల్లవి ఈ పాత్రలో ఏ విధంగా మెప్పిస్తారనే? దానిపై భారీ అంచనాలున్నాయి.



# దసరా బరిలో చిరు.. బర్త్ డే ట్రీట్ అదేనా..?



మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే ఆగస్టు 22న వస్తుండటంతో అభిమానులు సెలబ్రేషన్స్ చేసుకునేందుకు ఇప్పటినుంచే రెడీ అవుతున్నారు. ఇక ఈ క్రమంలో తమ అభిమాన హీరో నుంచి సినిమా అప్డేట్స్ కోరుతున్న ఫ్యాన్స్, చిరు నటిస్తున్న ‘విశ్వంభర’ కోసం ఆసక్తిగా చూస్తున్నారు. దర్శకుడు వశిష్ట రూపొందిస్తున్న ఈ భారీ సోషియో ఫాంటసీ చిత్రం విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఆలస్యమైన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. దీంతో ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దీనిపై ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇక బాక్సాఫీస్ వద్ద అక్టోబర్ 15న రాబోతున్న రజనీకాంత్ ‘జైలర్ 2’తో ఈ చిత్రం తలపడేందుకు సిద్ధమవుతుండటంతో అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది.

# రావిపూడి ఎఫెక్ట్.. త్రివిక్రమ్ పై ఇంత నెగిటివిటీ తగునా?



మన టాలీవుడ్ లో ఉన్నటువంటి టాప్ మోస్ట్ దర్శకుల్లో ఎప్పుడు నుంచో ఇండస్ట్రీలో ఉండి తనదైన సినిమాలతో ఆకట్టుకున్న మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఒకరు. తన పదునైన మాటలు, ఎమోషనల్ సన్నివేశాలు, ప్రాసలు, పంచ్ లతో రెండు దశాబ్దాలకి పైగా టాప్ దర్శకుల్లో ఒకరిగా తాను కొనసాగుతూ వచ్చారు. అయితే అల్టిమేట్ గా త్రివిక్రమ్ సినిమాలు అన్నీ కుటుంబ కథా చిత్రాలుగానే కనిపిస్తాయి. అయితే ఇప్పుడు ఉన్న ట్రెండ్ లో దర్శకుడు అనీల్ రావిపూడి కంప్లీట్ గా ఫ్యామిలీ ఎంటర్టైనర్ లని తీసుకొస్తూ వరుస హిట్స్ తో ఫుల్ ఫామ్ లో ఉన్నారు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ నుంచి ‘గుంటూరు కారం’ తర్వాత ‘ఆదర్శ కుటుంబం’ అనే మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ రాబోతుంది. అయితే ఈ సినిమా తాలూకా ప్రోమోలు చూసిన తర్వాత ఓ వర్గం ఆడియెన్స్ మాత్రం త్రివిక్రమ్ కి అనీల్ రావిపూడి సినిమాలుకి లింక్ పెట్టి సోషల్ మీడియాలో నెగిటివ్ చేసుకుంటున్నారు.

# లైవ్‌లోనే లెహంగా డ్రాప్.. శోభిత స్టైల్‌కు ఆడియన్స్ ఫిదా!

ఇండియా కౌచర్ వీక్ 2026 వేడుకల్లో నటి శోభిత ధూళిపాళ తన గ్లామర్‌తో అందరి దృష్టినీ ఆకట్టుకుంది. ఇండియా కౌచర్ వీక్ 2026 వేడుకల్లో నటి శోభిత ధూళిపాళ తన గ్లామర్‌తో అందరి దృష్టినీ ఆకట్టుకుంది. ప్రముఖ డిజైనర్ రాహుల్ మిశ్రా డిజైన్ చేసిన ‘దేవి’ కలెక్షన్‌కు ఆమె షోస్టాపర్‌గా వ్యవహరించింది. సాధారణంగా ర్యాంప్‌పై నడవడమే చూస్తుంటాం, కానీ ఇక్కడ అందరూ చూస్తుండగానే లైవ్‌లోనే శోభితకు లెహంగా డ్రాపింగ్ చేయడం విశేషం. ఈ అద్భుతమైన ప్రదర్శన, ఆమె అభినయం చూసి ఆడియన్స్ ఒక్కసారిగా ఫిదా అయిపోయారు. ఆ విశేషాలు చూద్దాం.. రాహుల్ మిశ్రా మ్యాజిక్: ‘దేవి’ కలెక్షన్: ఇటీవలే ప్యారిస్ హాట్ కౌచర్ వీక్‌లో ప్రదర్శించి ప్రశంసలు అందుకున్న ‘దేవి’ కలెక్షన్‌ను, రాహుల్ మిశ్రా ఈసారి భారతీయ సంస్కృతికి తగినట్లుగా ఢిల్లీ ర్యాంప్‌పైకి తీసుకొచ్చారు. ఇక స్త్రీత్వంలోని దైవత్వాన్ని ఆవిష్కరిస్తూ రూపుదిద్దిన ఈ దుస్తులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. సంప్రదాయ కలలకు ఆధునిక టచ్ ఇస్తూ డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్స్ ఫ్యాషన్ ప్రియులను బాగా ఆకట్టుకున్నాయి. దేవతలా మెరిసిపోయిన శోభిత: ఈ షోలో శోభిత మొదట ఐవరీ, షాంపైన్ కలర్ కాంబినేషన్‌లో ఉన్న కౌచర్ డ్రెస్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఇక సన్నని క్రిస్టల్ బీడ్స్ వర్క్‌తో తయారుచేసిన ఆ డ్రెస్ చూస్తే.. మెడలో అందమైన నగలే వేసుకున్నారా అన్నట్లుగా ఉంది. శోభిత రాచరికపు వెలుగుతో ర్యాంప్‌పై నడుస్తుంటే ప్రేక్షకులు కనురెప్ప వేయకుండా చూస్తూ ఉండిపోయారు. ర్యాంప్‌పైనే సర్ ప్రైజ్ చేసేశారు: ఆమె మొదటి వాక్ పూర్తయ్యాక అసలైన మ్యాజిక్ జరిగింది. ఇక శోభిత ర్యాంప్‌పై ఉండగానే కొందరు పర్ఫార్మర్స్ వచ్చి, ఆమె వేసుకున్న డ్రెస్‌పైనే ఎంతో గ్రాండ్‌గా ఉన్న లెహంగాను లైవ్‌లోనే తొడిగారు. అంతేకాదు, ఆ సమయంలోనే అదనపు ఆభరణాలను కూడా ఆమెకు తొడిగారు. దేవతకు అలంకారం చేస్తున్నట్లుగా..: పూర్వకాలంలో రాచరికంలో లేదా పూజా సమయాల్లో దేవికి అలంకరించినట్లుగా ఈ దృశ్యం అనిపించింది. ఇక కళ్ళముందే ఒక సాదాసీదా రూపం నుంచి పరిపూర్ణమైన దేవి రూపంలోకి శోభిత మారిపోవడం చూసి హాల్లో లోని వారందరూ చప్పట్లతో మార్మోగించారు. ఇక ఈ కాన్సెప్ట్ ఫ్యాషన్ షోకే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫ్యాషన్ షో అంటే కేవలం మోడల్స్ నడవడమే కాదని, అదొక గొప్ప కళ అని రాహుల్ మిశ్రా, శోభిత ధూళిపాళ కలిసి నిరూపించారు. ఇక సంప్రదాయ కళానైపుణ్యానికి, నాటకీయతను జోడించి చేసిన ఈ ప్రదర్శన ఇండియా కౌచర్ వీక్ 2026కే హైలైట్‌గా నిలిచిపోతుంది. శోభిత మేకప్, స్టైలింగ్, కాన్ఫిడెన్స్ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేశాయి.



Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555